ప్రజాశక్తి

మంగళవారం 8 ఏప్రిల్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

పోర్టు ఎగుమతులపై సుంకాల ప్రభావం

- అమెరికా తీరుతో విపిటి అధికారుల్లో ఆందోళన
- లక్షల టన్నుల సముద్ర ఉత్పత్తులు విశాఖ నుంచి ఏటా ఎగుమతి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

అమెరికా సుంకాల దాడి ప్రభావం విశాఖ పోర్టుపై పడే అవకాశముంది. దీనిపై పోర్టు అధికారుల్లో తాజాగా చర్చ నడుస్తోంది. సముద్ర ఆహార ఉత్పత్తుల రవాణాలో విశాఖపట్నం పోర్టు దేశంలోని మిగతా పోర్టుల కంటే స్థిరమైన ఎగుమతిదారు పాత్రను ఏళ్లతరబడి కొనసాగిస్తోంది. ఇక్కడి పోర్టు నుంచి నెల నెలా కంటైనర్లలో రొయ్యలను విదేశాలకు.. ముఖ్యంగా అమెరికాకు ఎగుమతి చేస్తున్నారు. దేశ మత్స్య పరిశ్రమ ప్రగతిలో విశాఖ పోర్టుది కీలకపాత్ర. తాజాగా ట్రంప్ పన్నుల దాడి విశాఖపట్నం పోర్టునూ ప్రభావితం చేయనున్నట్టు తెలుస్తోంది. పోర్టు అధికారులు తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం... 'ప్రస్తుతానికి వెళ్లాల్సిన షిప్పులు విదేశాలకు వెళ్లాయి. భవిష్యత్తులో రవాణా జరగాల్సిన నౌకలపై అమెరికా సుంకాల ప్రభావం పడుతుందన్న ఆందోళన లేకపోలేదు. నెలకు విశాఖ పోర్టు నుంచి సుమారు రూ.17 వేల కోట్లు విలువ చేసే సముద్ర ఉత్పత్తులు, అందునా ప్రధానంగా రొయ్యలే విదేశాలకు వెళ్తున్నాయి' అని వెల్లడించారు.

రాష్ట్ర జిఎస్‌డిపిలో రొయ్యల ఎగుమతుల రంగం వాటా సుమారు 11 శాతంగా ఉండడంతో సిఎం చంద్రబాబు సైతం తాజా సంక్షోభంపై స్పందిస్తూ కేంద్రానికి లేఖ రాయడం తెలిసిందే. అమెరికా తన రొయ్యల దిగుమతులకోసం ఈక్వెడార్‌ను ఎంచుకుంది. మన దేశంలో ఎపి రొయ్యల ఎగుమతుల్లో గణనీయ పాత్ర పోషిస్తున్న తరుణంలో రొయ్యల రైతుల నడ్డివిరిచేలా 25 శాతం సుంకాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించడంతో రొయ్యల పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లనున్నట్టు సమాచారం. రాష్ట్రం నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.20 వేల కోట్ల విలువైన సముద్ర ఆహార ఉత్పత్తులు ఎగుమతి కాగా ఒక్క విశాఖ పోర్టు నుంచే రూ.17,983.99 కోట్ల విలువైన 3.14 లక్షల టన్నుల సముద్ర ఉత్పత్తుల రవాణా జరిగింది. దేశంలోనే నెంబర్ 1 స్థానాన్ని విశాఖ పోర్టు దక్కించుకుంది. సరుకు రవాణాలో విశాఖ పోర్టు నెంబర్ వన్‌గా నిలిచేందుకు ఆక్వా పరిశ్రమ దోహదపడుతోంది. వనామి రకం రొయ్యలు, ఒడిశా నుంచి సముద్ర ఉత్పత్తులు అన్నీ విశాఖ పోర్టు నుంచే మిగతా 2లో..

బండ భారం

- రూ.50 పెరిగిన గ్యాస్ ధర
- మోడీ ప్రభుత్వంలో రూ.862కు చేరిక
- జిల్లాలో 3,72,321 కనెక్షన్లపై ప్రభావం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ప్రజలపై మోడీ ప్రభుత్వం గ్యాస్ బండ భారాన్ని మళ్లీ మోపింది. గృహావసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్‌పై రూ.50ను సోమవారం పెంచేసింది. ఉజ్వల పథకం లబ్ధిదారులను కూడా కేంద్ర బిజెపి ప్రభుత్వం వదల్లేదు. సిలిండర్ ధరను పెంచడంతో ప్రస్తుతం చెల్లిస్తున్న గ్యాస్‌కు అదనంగా వినియోగదారుడు రూ.50 చెల్లించాల్సివుంది. జిల్లాలో సాధారణ, దీపం, సిఎస్‌ఆర్, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు సుమారు 3,72,321 ఉన్నాయి. సగటున 40 రోజుల పాటు గ్యాస్ వినియోగించిన వారికి ఏడాదికి తొమ్మిది సిలిండర్లు అవసరంపడతాయి. ఒక గ్యాస్ వినియోగదారుడు ఏడాదికి అదనంగా రూ.450 భరించాల్సివుంది. జిల్లాలోని 3,72,321 గ్యాస్ కనెక్షన్లపై రూ.16.75 కోట్లు మిగతా 2లో..

పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలి : సిపిఎం

అధిక ధరలతో సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్యాస్ గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50, లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.2 చొప్పున ఎక్సైజ్ డ్యూటీని పెంచడాన్ని సిపిఎం విశాఖ, అనకాపల్లి జిల్లాల కార్యదర్శులు ఎం.జగ్గునాయుడు, జి.కోటేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు. ఉజ్వల పథకం కింద వచ్చే సిలిండర్ల ధరలకు కూడా ఈ పెంపు వర్తిస్తుందని ప్రకటించడం దారుణమని పేర్కొన్నారు. ఇప్పటికే మిగతా 2లో..

మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

వార్త 6లో..

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా చెన్నంశెట్టి రాజు

వార్త 2లో..

మంచి ఆహారంతో వ్యాధులు దూరం

వార్త 4లో..

రోడ్డు పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న పవన్ కల్యాణ్

ఆదివాసీల సమస్యలు పరిష్కరిస్తా

'అడవితల్లి బాట'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వార్త 8లో..

జివిఎంసి జోన్ కార్యాలయంపై ఎసిబి దాడులు

రూ.20 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన ఇద్దరు ఉద్యోగులు

ఎసిబి అధికారులకు చిక్కిన చంద్రశేఖర్, వెంకటరమణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జ్ఞానాపురంలోని జివిఎంసి జోన్ 5 కార్యాలయంపై సోమవారం ఎసిబి అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తికి మరణ ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు రూ.వేలు డిమాండ్ చేసి రూ.20 వేలు ఒప్పందం కుదుర్చుకొని లంచం తీసుకుంటుండగా డేటా ఎంట్రీ ఆపరేటర్ చంద్రశేఖర్, అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ వెంకటరమణ ఎసిబి అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్‌పి బివిఎస్.నాగేశ్వరరావు మీడియాతో మాట్లాడుతూ ఆర్‌పిఎఫ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మండవ శ్రీనివాసరావు మర్రిపాలెం వద్ద రైల్వే ట్రాక్‌పై ఇటీవల ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. ఆయన మరణాన్ని ధ్రువీకరిస్తూ పత్రం కావాలని ఆయన కుమారుడు భాను ప్రకాష్ జ్ఞానాపురంలోని జివిఎంసి జోన్ 5 కార్యాలయం డేటా ఎంట్రీ ఆపరేటర్ చంద్రశేఖర్‌ను, అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ వెంకటరమణలను సంప్రదించాడని వెల్లడించారు. వారు రూ.50 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ డియగా, తాను అంత ఇచ్చుకోలేనని, రూ.20 వేలు ఇవ్వగలనని భాను ప్రకాష్ చెప్పడంతో అంగీకారం కుదిరిందని తెలిపారు. ఈ నేపథ్యంలో భాను ప్రకాష్ శనివారం ఎసిబి కార్యాలయానికి వచ్చి తమతో సంప్రదించాడన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం తాము దాడులు నిర్వహించామని తెలిపారు. భాను ప్రకాష్ నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా నిందితులను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వెంటనే వారిద్దరినీ అరెస్టు చేశామని, మంగళవారం కోర్టులో ప్రవేశపెడతామని చెప్పారు. ఈ దాడులలో ఎసిబి ఏలూరు రేంజ్ డిఎస్‌పి రమ్య, ఇన్‌స్పెక్టర్లు కృష్ణ కిషోర్, వెంకటరావు, లక్ష్మణరావు, శ్రీనివాసరావు, సుప్రియ పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా చెన్నంశెట్టి రాజు

ప్రజాశక్తి - లీగల్ రిపోర్టర్ : ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు బదిలీపై వస్తున్నారు. ప్రస్తుత విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.గిరిధర్ ఎపి వేల్యేటెడ్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు చైర్మన్‌గా బదిలీ అయ్యారు. ఇదే స్థానంలో ప్రస్తుతం పనిచేస్తున్న గుత్తల గోపి కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. సాధారణ బదిలీ ప్రక్రియలో భాగంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సోమవారం ఈ బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా విశాఖపట్నంలో పలువురు జిల్లా న్యాయమూర్తులు బదిలీ అయి కొత్త న్యాయమూర్తులు వస్తున్నారు. విశాఖపట్నంలో 12వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా మూడు సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తి పి.గోవర్ధన్ కాకినాడ ఆరో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. అదే స్థానంలో ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తిగా రాజమండ్రిలో విధులు నిర్వహిస్తున్న డబ్బీర్ విజయ గౌతమ్ బదిలీపై వస్తున్నారు. ఏడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా విజయవాడలో విధులు నిర్వహిస్తున్న

చెన్నంశెట్టి రాజు

న్యాయమూర్తి ఎస్.నాగేశ్వరరావు ఎప్పటినుంచో ఖాళీగా ఉన్న విశాఖపట్నం లేబర్ అండ్ ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా బదిలీపై వస్తున్నారు. చిన్నపిల్లలపై లైంగిక వేధింపుల కేసుల విచారణ విశాఖ జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది మూడో అదనపు జిల్లా న్యాయమూర్తిగా కాకినాడకు బదిలీ అయ్యారు. అదే స్థానంలో ఏలూరులో ల్యాండ్ రిఫార్మ్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న పి.మంగాకుమారి బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం విశాఖపట్నంలో ఖాళీగా ఉన్న ఒకటో అదనపు సిబిఐ జడ్జిగా.. 10వ అదనపు జిల్లా న్యాయమూర్తిగా పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో విధులు నిర్వహిస్తున్న పి.విజయదుర్గ బదిలీపై వస్తున్నారు. రెండో అదనపు జిల్లా న్యాయమూర్తిగా అమలాపురంలో విధులు నిర్వహిస్తున్న వి.నరేష్ అనకాపల్లి పదో అదనపు జిల్లా న్యాయమూర్తిగా బదిలీపై వస్తున్నారు. అదే స్థానంలో ప్రస్తుతం పనిచేస్తున్న ఎన్.శ్రీవిద్య కర్నూలు జిల్లా ఎసిబి కోర్టుకు బదిలీ అయ్యారు. విశాఖపట్నంలో అదనపు ఫ్యామిలీ కోర్టు జడ్జిగా విధులు నిర్వహిస్తున్న న్యాయమూర్తి కె.వాణిశ్రీని ఏలూరు చిన్న పిల్లల లైంగిక వేధింపుల కేసుల విచారణ న్యాయస్థానానికి బదిలీ చేశారు. ఫ్యామిలీ కేసులు ఎక్కువగా పేరుకుపోతున్న తరుణంలో ఈ స్థానంలో కొత్తగా జడ్జిని బదిలీలో నియమించకపోవడంపై చర్చ నడుస్తోంది. బదిలీ అయిన వారంతా వారివారి స్థానాల్లో ఈ నెల 21వ తేదీలోపు జాయిన్ అవ్వాలని తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

పోర్టు ఎగుమతులపై సుంకాల ప్రభావం

విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

తాజా పన్నుల మోతతో...

విశాఖ పోర్టు నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే రొయ్యల విషయంలో ప్రస్తుతానికి సమస్య తలెత్తలేదని, త్వరలో దెబ్బ తగిలే అవకాశం ఉందని పోర్టు ఉన్నతాధికారి ఒకరు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఈక్వెడార్‌ను ప్రోత్సహించేందుకుగానూ అమెరికా తక్కువ టారిఫ్‌లు వారికి విధించి ఇతర దేశాలు, ముఖ్యంగా మన దేశం నుంచి ఎగుమతి అయ్యే వాటిపై అధిక సుంకాలు పెట్టడంతో ఎగుమతులపై ప్రభావం పడనుందని పేర్కొన్నారు. రూ.వేల కోట్ల రొయ్యల ఎగుమతులు నిలిచిపోయే ప్రమాదం లేకపోలేదన్నారు.

బండ భారం

అదనపు ఆదాయం ప్రభుత్వానికి రానుంది. గ్యాస్ ధరలు పెంచిన ప్రభుత్వం వినియోగదారునికి ఇచ్చే సబ్సిడీని పెంచడంలేదు. గ్యాస్ ధర ఎంత పెంచుతున్నా వినియోగదారునికి చెల్లించే సబ్సిడీ రూ.1.50 పైసలు, రెండు రూపాయలకు మించి వుండడంలేదు. 2013లో గ్యాస్ ధర రూ.410 వుంది. 2014 మే 26న మోడీ అధికారంలో వచ్చాక గ్యాస్ ధరలను క్రమంగా పెంచుతూ రూ.812కు చేర్చింది. తాజాగా సిలిండర్ ధరను రూ.50 పెంచడంతో వినియోగదారుడు చెల్లించాల్సిన ధర రూ.862కు వెళ్లింది.

పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలి : సిపిఎం

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. వెంటనే పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని ప్రజలకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజా సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. కలెక్టర్ జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి వారితో స్వయంగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జివిఎంసి అడిషనల్ కమిషనర్ వర్మ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి విచ్చేసిన అర్జీదారుడు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందేలా సత్వర, శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడి సమస్య పూర్వాపరాలు తెలుసుకొని సరైన పరిష్కారం చూపాలని, అందువల్ల అర్జీలు పునరావృతం కాకుండా ఉంటాయని కలెక్టర్ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతిరోజు కనీసం గంటపాటు అధికారులు శాఖాపరమైన సమీక్ష నిర్వహించి, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్‌లో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

జిఎస్‌డిపిపై బాబు మాయమాటలు : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎపి జిఎస్‌డిపిపై ముఖ్యమంత్రి చంద్రబాబు గిమ్మిక్కులతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం విశాఖపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే ఆంధ్రప్రదేశ్ జిఎస్‌డిపిలో రెండో స్థానంలో ఉందని చంద్రబాబు గొప్పగా ప్రకటించుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రజలకు వాస్తవాలను ఆయన తెలియజేయడం లేదన్నారు. తన పాలనలో అద్భుతమైన అభివృద్ధి సాధ్యపడిందని పచ్చి అబద్ధాలను చాటుకునే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు చెబుతున్నంత అభివృద్ధి నిజంగా ఉంటే ఎన్నికల హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రజలు త్వరలోనే అన్నీ తెలుసుకుంటారన్నారు.

కార్మికుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం 15 మంది కార్మికుల జీవితాలతో ఆడుకోవడం ఆపాలని, చట్టపరంగా కార్మికులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని ప్రైవేట్ కాలేజెస్ అండ్ స్కూల్స్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి వై.రాజు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం సంవత్సరాల తరబడి కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయించుకోవడమే తప్ప చట్ట ప్రకారం కార్మికులకు రావలసిన గ్రాట్యూటీ, లీవ్ ఎన్ క్యాష్మెంట్ చెల్లించడం లేదన్నారు. కార్మికులు క్రమశిక్షణగా, అంకితభావంతో పనిచేయాలని యాజమాన్యం నీతులు చెబుతోందని, తను మాత్రం చట్టాలను తుంగలో తొక్కి కార్మికులకు రావలసిన బకాయిలను ఎగ్గొట్టి జేబులు నింపుకోడానికి రకరకాల కుట్రలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కమిషనర్ ఆదేశాలను పాటించాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో యూనియన్ నాయకులు కెఎన్.రావు, పి.రామారావు, గోవింద్, నాగరాజు, సావిత్రమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వై.రాజు

ఎపిఐఐసి భూముల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం తర్లువాడ గ్రామపంచాయతీ సర్వేనెంబర్-1లో ఎపిఐఐసికి కేటాయించిన భూములను సోమవారం ఆర్‌డిఒ సంగీత్ మాదూర్ పరిశీలించారు. ఎపిఐఐసికి కేటాయించిన 250 ఎకరాల్లో ప్రస్తుతం ఎలా ఉంది, రైతులు ఎవరైనా ఉన్నారా అని తహశీల్దార్ శ్యాంప్రసాద్‌ను వివరాలడిగి తెలుసుకున్నారు.

ఇటుక బట్టీల్లో పిల్లలకు మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి-ఆనందపురం : ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఆనందపురం మండలం బోని గ్రామపంచాయతీలోని ఇటుక బట్టీలో పనిచేస్తున్న వారి బడిఈడు పిల్లల 70 మందికి సోమవారం మధ్యాహ్నం అక్షయ పాత్ర సహాయంతో భోజనం ఏర్పాటు చేశారు. ఆ కుటుంబాల్లో బడిఈడు పిల్లలను గుర్తించి వారికి అంగన్‌వాడీ కార్యకర్తల సహాయంతో విద్య నేర్పించి ఏప్రిల్ 23వ తేదీ వరకు మధ్యాహ్నం పూట ఉచితంగా భోజనం ఏర్పాటు చేయనున్నట్లు ఎంఇఒ-1 కె.గంగరాజు, ఎంఇఒ 2 వి.జోగేంద్రనాథ్ తెలిపారు.

ఎవిఎన్‌లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓల్డ్ టౌన్‌లోని ఎవిఎన్ కళాశాలలో సోమవారం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-27 విద్యా సంవత్సరానికి ఎంపిసి, బిపిసి, సిఇసి, హెచ్ఇసి, ఎంఇసి తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో ప్రవేశాలుంటాయన్నారు. అదే విధంగా ఎంఎల్‌టి, ఎంపిహెచ్‌డబ్ల్యు (ఎఫ్), ఒకేషనల్ కోర్సుల్లో కూడా ప్రవేశాలకు సంబంధించి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. వీటికి సంబంధించి కళాశాల అడ్మిషన్ల కన్వీనర్ కె.ఇందిరను 9951405064 నెంబరులో సంప్రదించాలని కోరారు.

దీపికకు పరామర్శ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల మధురవాడలో ప్రేమోన్మాది దాడిలో గాయపడి మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దీపికను విజయనగరం జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్, వైసిపి భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు సోమవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. నానాటికీ హింస పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటు సభ్యురాలు తనూజారాణి, శాసనమండలి సభ్యులు వరుదు కళ్యాణి, నాయకులు పేడాడ రమణ కుమారి, ఐదో వార్డు అధ్యక్షులు పోతిన హనుమంతరావు పాల్గొన్నారు.

In the Court of the Hon'ble VII Addl. District Judge, Peddapuram
M.V.O.P. No. 439/2014
Between:
Desala Rajababu ...*Petitioner*
AND
Bondadi @ Gondadi Subba Rao and Others ...*Respondents*
R-4: L.Venkata Ramana, S/o. Appala Raju, D.No. 1-28, K.D.Peta, A.L.Puram, Golugonda, Golugonda Mandal, Visakhapatnam District.
R-5: Manchi Seshagiri Rao, S/o. Kotaiah, D.No. 35-369, Purushotham Patnam, Chilakaluri peta, Guntur Dist.,
పై కేసులో R4, R5 మీరు ఇద్దరు నోటీసులు అందుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున పై ఇరువురు **ది. 17-04-2025వ తేదీన** పై కోర్టులో మీరు గాని, మీ తరపు ప్లీడరు గారు గాని **ఉదయం గం॥ 10.30 ని॥లకు** హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలియపరచవలెను. లేనియెడల పై పిటీషన్‌లో మీ పరోక్షముగా తీర్మానించబడును.
P.PRASAD BABU
Peddapuram Advocate, Kakinada
04-04-2025 Cell: 9948563059

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 473/2022
Between:
Kothapalli Appa Rao ...*Petitioner*
AND
Vaitla Satish and Others ...*Respondents*
R-1: Vaitla Satish, S/o. Krishna, Hindu, aged 25 years, Driver of the Car crime vehicle bearing No: AP 31 ER 5681, R/o. No.37-29-13/6, Rajeev Nagar, Rasalamma Colony, Kurmannapalem (V), Duvvada (M), Visakha Dt., ...*1st Respondent*
పై నెంబరు పిటిషన్‌లో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్సు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 28-4-2025 సం॥ర తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్‌లో మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషనుపు మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
జి.సతీష్‌కుమార్
రాజమండ్రి **జి.అంబికా ప్రసాద్**
07-4-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

రుణాల కోసం నిరుద్యోగుల ఎదురుచూపు

ఆనందపురం మండలంలో ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగులు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆనందపురం : నిరుద్యోగ యువతకు ఉపాధిని పెంపొందించాలని ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ ద్వారా రుణాలిచ్చేందుకు దరఖాస్తులు స్వీకరించడంతో ఎంతో ఉత్సాహంగా నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకున్నారు. ఆనందపురం మండలంలో కార్పొరేషన్ రుణాలకు 80 యూనిట్లు మంజూరు కాగా, నిరుద్యోగ యువత 848 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక స్వయం ఉపాధి కోసం దరఖాస్తులు చేసుకున్నా అందరికీ యూనిట్లు రావని తెలిసి ఆందోళన చెందుతున్నారు. రాజకీయం, మరే ఇతర ప్రలోభాలకు లోను కాకుండా అర్హులకు రుణాలు అందించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. రాజకీయ నాయకుల పలుకుబడితో రుణాలు పక్కదారి పట్టే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

653 మంది ఇంటర్వ్యూకు హాజరు

ఆనందపురం మండలంలో కార్పొరేషన్ రుణాల కోసం నిర్వహించిన ఇంటర్వ్యూకు సోమవారం 450 మంది హాజరయ్యారు. 4వ తేదీన జరిగిన ఇంటర్వ్యూకు 203 మంది హాజరయ్యారు. మొత్తంగా 653 మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి తెలిపారు. 848 మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోగా 653 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. సోమవారం ఇంటర్వ్యూలో దరఖాస్తుదారుల పత్రాలను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు

నేడు భీమిలిలో లబ్ధిదారుల ఎంపిక

భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం పరిధి 1 నుంచి 4 వార్డుల్లో స్వయం ఉపాధి పథకం కింద వివిధ యూనిట్ల మంజూరు నిమిత్తం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన 1525 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఈ నెల 8వ తేదీ ఉదయం 9 గంటల నుంచి స్థానిక తోటవీధి జివిఎంసి కళ్యాణ మండపం వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్నవాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు, ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాల జెరాక్స్, ఒరిజినల్ ధ్రువపత్రాలు తీసుకొని రావాలని సూచించారు. వివిధ బ్యాంకులు, బిసి కార్పొరేషన్ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు.

మధురవాడ జోన్‌లో 9న ఇంటర్వ్యూలు

మధురవాడ : స్వయం ఉపాధి కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 9వ తేదీన పి.ఎం.పాలెంలోని కమ్యూనిటీ హాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి తెలిపారు. దరఖాస్తుదారులు ఆన్‌లైన్‌లో పెట్టుకున్న దరఖాస్తు, ఆధార్, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, వాహనాల కోసం పెడితే డ్రైవింగ్ లైసెన్స్ జెరాక్స్ 1 సెట్, అన్ని ఒరిజినల్ పత్రాలు తీసుకొని హాజరుకావాలని పేర్కొన్నారు. 9తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 9 నుంచి 13 వార్డుల లబ్ధిదారులకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 5 నుంచి 8 వార్డుల లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు.

నేరాలు ఘోరాలు

యువకుని దారుణహత్య

ప్రజాశక్తి- రావికమతం : మండలంలో మేడివాడ గ్రామానికి చెందిన యువకుడు ఆదివారం రాత్రి దారుణహత్యకు గురయ్యాడు. విషయాన్ని తెలుసుకున్న కొత్తకోట సిఐ కోటేశ్వరరావు, రావికమతం ఎస్ఐ రఘువర్మ, సంఘటన స్థలానికి చేరుకొని మృతుని వివరాలను సేకరించి విచారణ చేపట్టారు. దీనిపై సిఐ కోటేశ్వరరావు మీడియాకు తెలిపిన వివరాలివి. గర్నికం తిరుమల ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న రోడ్డు పక్కన రాత్రి 12 గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు మేడివాడ గ్రామానికి చెందిన కోలిపాక పవన్‌కుమార్ (22)పై దాడిచేసి దారుణంగా మట్టుపెట్టారు. మృతుని తండ్రి కోలిపాక త్రిమూర్తులు అందించిన సమాచారం మేరకు రావికమతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సంఘటనాస్థలానికి సిఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో క్లూస్‌టీం చేరుకుని ఆధారాలను సేకరించింది. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని సిఐ తెలిపారు. పవన్ హత్యకు కారణాలను తెలియరావడం లేదు, పోలీసుల విచారణలో వాస్తవాలు వెలుగుచూసే ఛాన్స్ ఉంది.

జూ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్‌లో గత 15 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సెలవులు అమలు చేయాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్‌చేశారు. ఉప ముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ మంగళవారం జూ పార్కును సందర్శిస్తున్న నేపథ్యంలో కార్మికుల జీతభత్యాలపై స్పందించాలని కోరారు. జూలో కార్మికులకు ప్రమాదం జరిగినా, చనిపోయినా ఏ విధమైన రక్షణ, భరోసా లేవన్నారు. వీరంతా అతి తక్కువ జీతాలతో పనిచేస్తున్నారని, మార్కెట్‌లో పెరిగిన ధరల కనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అమలుచేయాలని కోరారు. తరచూ జంతువులకు ఆహారం పెడుతున్నప్పుడు, గదులు శుభ్రం చేస్తున్నప్పుడు వాటి దాడిలో గాయాలపాలవడం, మృతిచెందిన ఘటనలూ ఉన్నాయని గుర్తుచేశారు. గాయాల పాలైన వారికి పూర్తి వైద్య సదుపాయాన్ని జూ యాజమాన్యమే భరించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలను జూ యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఆదుకునే విధంగా చట్టం చేయాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి స్పందించి కార్మిక కుటుంబాలు మెరుగైన జీవితం గడిపేందుకు కృషి చేయాలని కోరారు.

పిజిఆర్‌ఎస్‌లో 5 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి 5 అర్జీలు అందినట్లు జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 3, ఇంజినీరింగ్, యు సి డి విభాగాలకు సంబంధించి చెరొక అర్జీ అందినట్లు పేర్కొన్నారు. సంబంధిత అర్జీలను తదుపరి చర్యల నిమిత్తం ఆయా విభాగాల అధికారులకు పంపించినట్లు తెలిపారు.

7వ వార్డులో జెడ్‌సి పర్యటన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డులోని మానం ఆంజనేయులు కాలనీ, మల్లయ్యపాలెంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, స్థానిక టిడిపి నాయకుడు పిళ్లా వెంకటరావు పర్యటించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. ముఖ్యంగా కాలువలు, రోడ్లు, తాగునీటి సమస్యలు వారి దృష్టికి వచ్చాయి. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత విభాగాల అధికారులను జోనల్ కమిషనర్ ఆదేశించారు.

విద్యుత్ ఎఇగా అప్పలనాయుడు

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం ఎలక్ట్రికల్ ఎఇగా మండల అప్పలనాయుడు బాధ్యతలు చేపట్టారు. పి.ఎం.పాలెంలో రెండేళ్లగా విధులు నిర్వహిస్తున్నారు. బదిలీలో ఆనందపురం మండలానికి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎఇ సురేష్‌కుమార్ జి.మాడుగుల వద్దాదికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ప్రమోషన్‌పై వెళ్లారు.

ఆళ్వార్ దాస్ క్యాంపస్‌లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-వేపగుంట : గోపాలపట్నం సమీపంలోని ఆళ్వార్‌దాస్ డిగ్రీ కళాశాలలో హనీ గ్రూప్ రియల్టర్ సంస్థ ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఈ ఎంపికలకు వివిధ కళాశాలల నుంచి 120 మంది హాజరుకాగా 15 మంది ఎంపికయ్యారు. వారిలో 10 మంది ఆళ్వార్ దాస్ డిగ్రీ విద్యార్థులు ఉన్నట్లు కళాశాల ప్రతినిధులు ప్రకటించారు. ఎంపికైన వారందరికీ ఆఫర్ లెటర్స్ అందజేశారు. వీరు ఈ నెల 9వ తేదీన విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఎంపికైన వారికి ఆళ్వార్‌దాస్ గ్రూప్ ప్రతినిధులు డాక్టర్ ఎస్‌వి హెచ్.రాజేంద్ర, సుంకరి రాహుల్ ఆళ్వార్ దాస్, జివిఎస్.భగవాన్ అభినందనలు తెలిపారు.

యువకుడు బ్రెయిన్‌డెడ్

ఐదుగురికి కొత్త వెలుగులు నింపిన ఆశిష్ చౌల్ సింగ్

ప్రజాశక్తి - ఆరిలోవ : యువకుడు బ్రెయిన్‌డెడ్ అయిన యువకుని కుటుంబం తీసుకున్న నిర్ణయంతో మరో ఐదుగురు జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి. చేతికి అందివస్తున్న కుమారుడు దూరమయ్యాడన్న దు:ఖంలోనూ వేరే కుటుంబాల్లో ఆనందం కోసం ఆ కుటుంబం మానవత్వాన్ని చాటుకుంది. ఒడిశా రాష్ట్రం కోరాపుట్టులోని సోనాపేడలో నివాసముంటున్న ఆశిష్ చౌల్ సింగ్ (22) ఈ నెల 2వ తేదీన బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలతో విశాఖలోని ప్రయివేటు హాస్పిటల్‌లో చేరాడు. ఆసుపత్రి వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ యువకుడి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించింది. దీంతో సోమవారం బ్రెయిన్ డెడ్‌గా వైద్యులు ప్రకటించారు. ఆ తర్వాత అవయవదానంపై యువకుని కుటుంబ సభ్యులు,

ఆశిష్‌చౌల్‌సింగ్ (ఫైల్)

బంధువులకు వైద్య బృందం అవగాహన కల్పించడంతో వారు అంగీకారం తెలిపారు. ఈ విషయాన్ని జీవన్ దాన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. యువకుడి నుంచి అవయవాలను సేకరించేందుకు ఆయన అనుమతులు జారీ చేశారు. దీంతో యువకుని 2 కిడ్నీలు, లివర్, పాంక్రియాస్, స్మాల్ బౌల్ తీశారు. వాటిని జీవన్ దాన్ ప్రోటోకాల్ ప్రకారం సీనియార్టీ ఆధారంగా అవయవాలను కేటాయించారు. ఈ సందర్భంగా అవయవదానంపై అవగాహన కల్పించిన వైద్య బృందానికి, అవయవదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులకు డాక్టర్ కె.రాంబాబు అభినందనలు తెలిపారు. గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలను ఇతర ఆస్పత్రులకు తరలించడంలో సహకరించిన పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు భాష గొప్పతనాన్ని విస్తరించాలి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - ఆరిలోవ : తెలుగు భాష గొప్పతనాన్ని రాబోయే తరాలకు విస్తరించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆంధ్ర సారస్వత పరిషత్ ఆధ్వర్యాన 2026 జనవరి 3, 4, 5 తేదీలలో అమరావతిలో జరగనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల లోగోను సోమవారం ముడసర్లోవ ఈస్ట్ పాయింట్ గోల్ఫ్ క్లబ్‌లో అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, తెలుగు భాష తల్లివంటిదని, భాష గొప్పతనాన్ని నేటి యువతరానికి చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనా, మేధావులపైనా ఉందన్నారు. తెలుగు వాడిగా తెలుగును గౌరవించాలన్నారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలుగు మహాసభలకు ప్రతి తెలుగు వ్యక్తి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం యూత్ రెడ్ క్రాస్ పోస్టర్లను స్పీకర్ ఆవిష్కరించారు. ఈ


తెలుగు మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

కార్యక్రమంలో ప్రపంచ తెలుగు మహాసభల ముఖ్య సమన్వయకర్త పి.రామచంద్రరాజు, రెడ్ క్రాస్ స్టేట్ చైర్మన్ వై.డి.రామారావు, ఎంఎస్ఎన్.రాజు, సుశీల, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎసిఎ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా సుజయ్‌కృష్ణ రంగారావు

ప్రజాశక్తి-మధురవాడ : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రావు వెంకట సుజయ్‌కృష్ణ రంగారావు సోమవారం ఎన్నికయ్యారు. త్వరలో జరగనున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆంధ్రా ప్రీమియర్ లీగ్-2025 నిర్వహణ బాధ్యతలను చైర్మన్ హోదాలో సుజయ్ కృష్ణ రంగారావు చేపట్టనున్నారు. సుజయ్‌కృష్ణ రంగారావుకు అన్ని క్రికెట్ సంఘాలు, అభిమానులు అభినందనలు తెలిపారు. 2025 ఆంధ్రా ప్రీమియర్ లీగ్ చైర్మన్‌గా ఎన్నుకునందుకు గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులకు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ గౌరవ ప్రెసిడెంట్ కేశినేని శివనాథ్ (చిన్ని)కు, గౌరవ కార్యదర్శి సానా సతీష్‌బాబుకు, అపెక్స్ మెంబర్లకు సుజయ్‌కృష్ణ రంగారావు కృతజ్ఞతలు తెలిపారు.

అతిథి గృహానికి రూ.5 లక్షలు మంజూరు

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పద్మనాభం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ అతిథి గృహానికి విశాఖపట్నం జిల్లా పరిషత్ నుంచి రూ.5 లక్షలు మంజూరైనట్లు మండల ఎఇ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈ నిధులతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. 'అలనా పాలనా లేని జెడ్పి అతిథి గృహం' శీర్షికన ఈ నెల 1వ తేదీన ప్రజాశక్తిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. రూ.5 లక్షలు మంజూరు చేసి స్లాబ్ మరమ్మత్తులు చేపట్టారు.

ప్రజాశక్తి కథనానికి ముందు...

ప్రజాశక్తి కథనం తర్వాత పనులు

డాక్టర్ మాల్యదకు ఎంపీ శ్రీభరత్ అభినందనలు

ప్రజాశక్తి-మధురవాడ : ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారం అందుకున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ మాల్యదను గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సోమవారం అభినందించారు. గీతం విశ్వవిద్యాలయం ద్వారా భారతీ కళారూపాలపై యువతలో మరింత అవగాహన పెంచాలని, భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఎంపీ ఆకాంక్షించారు. కూచిపూడి నృత్య కళాకారిణి అయిన డాక్టర్ మాల్యద శాస్త్రీయ నృత్య రీతులపై పరిశోధనలకు అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్‌ను అందుకున్నారు. రేవా విశ్వవిద్యాలయం నుంచి భారతీయ సంస్కృతిపై ముఖ్యంగా పురాణాలు, దేవాలయ శిలాశాసనాలు, క్లాసికల్ గ్రంథాల ఆధారితంగా జరిపిన పరిశోధనలకు డాక్టరేట్ అందుకున్నారు.

దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

చలో పోర్టు చైర్మన్ ఆఫీస్‌ను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ టెండర్ రద్దు చేయాలని ఏప్రిల్ 9వ తేదీన చేపట్టే చలో పోర్టు చైర్మన్ ఆఫీస్‌ను జయప్రదం చేయాలని పోర్టు యూనియన్ నాయకులు కె.సత్యనారాయణ పిలుపునిచ్చారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 189వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఏటా రూ.వందల కోట్ల లాభాలు ఆర్జిస్తున్నా పోర్టు ఉద్యోగుల ఆరోగ్యాన్ని వ్యాపారం చేయటం సమంజసం కాదన్నారు. ఈ సంవత్సరం సుమారు రూ.800 కోట్లు లాభాలు వచ్చాయని, దాంట్లో నాలుగో వంతు ఖర్చుపెట్టినా హాస్పిటల్లో ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బందిని నియమించవచ్చని తెలిపారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్‌ఫండ్స్, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ ప్రయివేటీకరణ నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయుడు, కెఎస్.కుమార్, బి.జగన్, పైడిరాజు, శంకర్రావు, రాఘవులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం ఎంపిడిఒ కార్యాలయ సమావేశం మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత మండల, గ్రామస్థాయి అధికారులు శాఖా పరమైన అంశాలతో హాజరుకావాలని ఆదేశించారు. ఎంపిటిసిలు, సర్పంచులు హాజరుకావాలని కోరారు.

ప్రజాసమస్యలు పరిష్కరించాలి

జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ గంగారావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని ప్రజాసమస్యలను పరిష్కరించాలని జివిఎంసి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమిలి జోనల్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా చైతన్య యాత్రలో భాగంగా జివిఎంసి 1,2 వార్డుల్లో పలు సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. ఒకటో వార్డు కొండపేట పంప్ హౌస్ సమీపంలోని కొండవాలు ప్రాంతంలో మెట్ల మార్గం పూర్తి స్థాయిలో లేనందున వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల మంజూరు సందర్భంగా లబ్ధిదారులనుంచి రూ.35 వేలు కట్టించుకున్నా నేటికీ ఇళ్లు, ఇళ్ల స్థలం మంజూరు చేయలేదని ఎంతోమంది తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. తగరపువలస జంక్షన్ నుంచి మెయిన్ రోడ్డు వరకు గతంలో నిర్మించిన డివైడర్ ఎత్తును తగ్గించాలని కోరారు. రెండో వార్డు బాలాజీనగర్‌లో, యాతపేటలో సెల్ టవర్ ఏర్పాటు ప్రయత్నాన్ని వెనక్కి తీసుకోవాలని, నిర్ణీత కాలంలో సమస్యలు పరిష్కరించాలని, సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనేక సాంకేతిక కారణాల పేరుతో చాలా మంది అర్హులైన వారికి వంట గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ ఇవ్వడం లేదన్నారు. ప్రజా చైతన్య యాత్రలో ఈ సమస్యను ఎంతో మంది తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, నాయకులు పంపాన సూర్యనారాయణ, రీసు నరసింగరావు, రీసు చిన్నారావు, ఎన్.శ్రీను తదితరులు పాల్గొన్నారు.



భీమిలి జోనల్ కార్యాలయం వద్ద ధర్నాలో మాట్లాడుతున్న డాక్టర్ గంగారావు

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 47వ వార్డు పరిధి సంజీవయ్య కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ హాల్ మొదటి ఫ్లోర్ సామాజిక భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సోమవారం ప్రారంభించారు. సంజీవయ్య కాలనీ-2లో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉత్తరం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని చెప్పారు. స్థానిక ప్రజల సమస్యల మేరకు పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి, ఉషాకిరణ్, నజీర్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

పవన్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-పెందుర్తి : అడవి తల్లి బాట కార్యక్రమంలో భాగంగా అల్లూరి జిల్లాకు వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు పెందుర్తి కూడలి వద్ద ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యాన కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. పవన్ కల్యాణ్ అందరికీ అభివాదం చేశారు.

పవన్‌కు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

మంచి ఆహారంతో వ్యాధులు దూరం

ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో వక్తలు

మాట్లాడుతున్న డాక్టర్ డిటిఎన్.శిరీష

ప్రజాశక్తి-యంత్రాంగం

గాజువాక : మంచి ఆహారంతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ డైటీషియన్ డాక్టర్ డిటిఎన్.శిరీష తెలిపారు. షీలా నగర్ అవేక్ వెల్ఫేర్ అసోసియేషన్, ఐద్వా ఆధ్వర్యాన అంతర్జాతీయ ఆరోగ్యం దినోత్సవంపై షీలానగర్‌లో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీవన శైలిలో మార్పుల వల్ల అనారోగ్యానికి గురైన వ్యక్తి కూడా ఆరోగ్యంగా మారతారని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి తరచూ ఒత్తిడికి గురై బీపీ, సుగర్ వ్యాధులకు లోనవుతున్నారని, మంచి ఆహారపు అలవాట్లు ద్వారా వీటిని తగ్గించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, జి.మణి, గీత, జానకి పాల్గొన్నారు.

కరాస: ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం కంచరపాలెం జోన్ ఆధ్వర్యాన ఆరోగ్య సంరక్షణ అంశంపై అవగాహన సదస్సు సోమవారం హస్మి భవనంలో నిర్వహించారు. కెజిహెచ్ మైక్రోబయాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ఎన్.భాగ్య మహిళల ఆరోగ్య సమస్యలు సందేశాలపై పలు సూచనలిచ్చారు. రుతుక్రమ సమస్యలు, యాంటీబయాటిక్ మందులు వాడకం గురించి వివరించారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అన్వేష్ సుగర్, గుండె సంబంధిత అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు సుమిత్ర, హేమలత, జయలక్ష్మి, ఉమ, పావని, సుజాత, పార్వతి, అరుణజ తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గ్రీన్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో ఆల్వార్ దాస్ కళాశాలలో మొక్కలు నాటారు. పక్షుల కోసం మట్టి పాత్రలలో నీరు ఏర్పాటు చేశారు. పిచ్చుకలకు గూళ్లు సమకూర్చారు. ఆల్వార్ దాస్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్ క్లైమేట్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జెవి.రత్నం, లెక్చరర్లు అప్పారావు, రాజేష్, ఎన్.రాణి ప్రియాంక పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : విద్యార్థులు, పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కెజిహెచ్ పిల్లల వార్డులో ఆసుపత్రి వార్డు విభాగాధిపతి డాక్టర్ బిఎస్.చక్రవర్తి అధ్వర్యంలో తల్లి - పిల్లల ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ జి.రత్నకుమారి, డాక్టర్ ఎం.చౌదరిబాబు, డాక్టర్ కె.సత్యకుమారి, డాక్టర్ పి.సందీప్ పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ విమలగిరి విద్యార్థులకు ఆరోగ్యం పెంపొందించుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, సిహెచ్ఓ ఆర్ దేవకాంత, వైద్య సిబ్బంది, పాఠశాల సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం ర్యాలీ, అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఎ.మనీషా మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వి.ప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారి ఏవి.సుబ్బారావు ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవన విధానం అలవరుచుకోవాలి

ములగాడ : ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని యువత ఆచరించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ప్రముఖ నర్సింగ్ అధ్యాపకులు, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి ఎన్.నదియా సూచించారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి ఆరోగ్య అవగాహన ఎంతో అవసరం అన్నారు. ప్రతి ఒక్కరూ తగినంత శారీరక వ్యాయామం చేయాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ఒత్తిడిని అధిగమించడానికి సామాజిక సేవా కార్యక్రమాలను, లలిత కళలను ఆశ్రయించాలని సూచించారు. జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, చిన్న వయసు నుంచి ఆరోగ్యవంతమైన అలవాట్లను ఏర్పరచుకున్నప్పుడే భవిష్యత్తు ఆశాజనకంగా ఉంటుందన్నారు. అనంతరం శారీరక, మానసిక ఆరోగ్యాలపై ఎ.ఆదిలక్ష్మి, యోగాపై ఎ.సంధ్యారాణి, వ్యక్తిగత పరిశుభ్రతపై సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయా దేవి, పరిశుభ్ర వాతావరణంపై వి.అంజలిదేవి, రక్తహీనతపై సుధ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ధనలక్ష్మి, సలోమి, రాజకుమారి, శిరీష పాల్గొన్నారు.

హస్మి భవనంలో మాట్లాడుతున్న డాక్టర్ భాగ్య

మందులపై పెంచిన ధరలను వెనక్కు తీసుకోవాలి

విశాఖ కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల 900 రకాల మందులపై పెంచిన ధరల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, వైద్యం, వైద్య ఉత్పత్తులపై జిఎస్‌టిని 0 శాతానికి తగ్గించాలని, మందులపై ఉన్న జిఎస్‌టిని పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ ప్రజారోగ్య వేదిక, ప్రజారోగ్య పరిరక్షణ కమిటీ, జన విజ్ఞాన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కెజిహెచ్ ఓపి గేటు వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. డిమాండ్లతో కూడిన బ్యానర్‌పై డాక్టర్లు, మెడికల్ ప్రతినిధులు, మెడికల్ రిప్స్, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు, జన విజ్ఞాన వేదిక నాయకులు, సిఐటియు, డివైఎఫ్ఐ తదితర ప్రజా సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొని సంతకాలు చేశారు. సాధారణ పౌరులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావడం విశేషం. ఈ సందర్భంగా ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.కామేశ్వరరావు, విశాఖపట్నం కార్యదర్శి ఐ.శేషుకుమార్, జిల్లా మాజీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.రామారావు, డాక్టర్ వైఎల్.నరసింగ రావు, జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఎంవిఆర్ఎస్.శ్రీకాంత్, మెడికల్ రిప్స్ రాష్ట్ర కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, కళాధర్, ఆవాజ్ నాయకులు అష్రాఫ్, సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్ కుమార్ తదితరులు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఇన్సూరెన్స్ పథకాన్ని తక్షణమే అమలు చేసి ప్రజలకు ఉచిత మందులను అందించాలని, నాణ్యమైన ఆరోగ్య సేవలను ప్రతిఒక్కరికీ అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్స్ ఆరోగ్య రంగంలోని అనేక సమస్యలను పరిష్కరించడానికి, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ఇది ప్రజల ఆరోగ్య హక్కుల కోసం ఒక సమగ్ర ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు.

సంతకాలను సేకరిస్తున్న కామేశ్వరరావు, వైఎల్.నరసింగరావు తదితరులు

పవన్ కల్యాణ్‌గారూ.. ఉపాధి హామీ బకాయిలు చెల్లించరూ..

చేతులు జోడించి నిరసన తెలిపిన కూలీలు

చేతులు జోడించి వేడుకుంటున్న ఉపాధి హామీ కూలీలు

ప్రజాశక్తి-కె.కోటపాడు

'ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌గారూ... ఎన్ఆర్ఇజిఎస్ కింద చేసిన పనులకు వేతన బకాయిలు చెల్లించండి' అంటూ మండలంలోని సింగన్నదొరపాలెం, కె.కోటపాడు గ్రామాలకు చెందిన ఉపాధి హామీ కూలీలు సోమవారం పని ప్రదేశాల్లో చేతులు జోడించి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వీరికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, సిఐటియు మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.54 కోట్లు ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 10 వారాలు నుండి కూలి డబ్బులు చెల్లించకపోతే పేద కూలీలు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. పని ప్రదేశంలో టెంట్లు వేయాలని, తాగునీరు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని, పనిముట్లు, సమ్మర్ అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో జిల్లా మొదటి స్థానంలో ఉందని అనకాపల్లి జిల్లా కలెక్టర్ ప్రకటించారని, మరి కూలీలకు వేతనాలు చెల్లింపులోనూ మొదటి స్థానంలో ఉండాలి కాదా! అని ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పర్యటన సందర్భంగా దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

క్రెబ్స్ కాలుష్యంపై పవన్‌కు ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లిరూరల్ : కశింకోట మండలం కొత్తపేట గ్రామంలో ఉన్న క్రెబ్స్ కంపెనీ కాలుష్యంతో దశాబ్దాలుగా అల్లాడుతున్న ప్రజలను కాపాడాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పవన్‌కు ఇఎఎస్.శర్మ లేఖ రాశారు. క్రెబ్స్ బయో కెమికల్స్ అండ్ ఇండస్ట్రీస్ వలన గాలి, నీరు కలుష్యమయ్యాయని తెలిపారు. క్రెబ్స్ కంపెనీతో అక్కడ ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారని వాపోయారు. దీనిపై ఎన్నో పోరాటాలు చేశామని అయినా సరైన చర్యలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనారోగ్య సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని వాపోయారు. డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ చొరవ చూపి ప్రజల రక్షణ కోసం కృషి చేయాలని కోరారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక మదర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయం ఆవరణలో ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ వి.సత్యగంగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు సుమారు 1500 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ట్రస్టు సేవలను అభినందించి జిల్లా తెలుగు యువత కార్యదర్శి రోమాల చంద్రశేఖర్ ఈ చలివేంద్రానికి రూ.5 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పల్లా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీనివాసరావు, నారపాడు సర్పంచ్ మామిడి శంకర్రావు, గొంప అశోక్ కుమార్, బర్ల రమణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లకు శిక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో సోమవారం ఎన్యుమరేటర్లకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఎన్యుమెలేటర్లు అందరూ అన్ని గ్రామపంచాయతీలో ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంస్థగత నిర్మాణం ఏపీఎం చంద్రకళ, ఎంపీడీఓ ఎంవి.సువర్ణరాజు, మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ, పశు వైద్యాధికారి మంజూషరాణి, వెలుగు ఏపీఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థికి హైహోమ్ స్కాలర్ షిప్

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు హైహోమ్ ఇండస్ట్రీ గత ఏడాది మంచి మార్కులు సాధించిన విద్యార్థి గొర్లె రాజేంద్రకు రూ.8,000 వేలు స్కాలర్ షిప్‌ను అందజేసింది. ఈ మేరకు యలమంచిలి రైల్వే స్టేషన్ ప్రభుత్వ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థికి చెక్కు రూపంలో నగదు బహుమతిని సోమవారం అందజేసినట్లు కొక్కిరాపల్లికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ తెలిపారు.

టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కశింకోట : కసింకోట మండలం నర్సింగబిల్లి పంచాయితీ జంగాల కాలనీకి చెందిన పదో తరగతి విద్యార్థిని పిల్లి బోయిన బ్యూలా (15) ఆత్మహత్య కేసులో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బాలిక బ్యూలా శుక్రవారం ఇంట్లో ఫ్యాన్ చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకోగా, అదే ప్రాంతానికి చెందిన పెయింటర్ ప్రేమిస్తున్నానని తరచూ వేధించడంతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి వరహాలరావు పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ మేరకు కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడు ఒమ్మి జయకృష్ణ (నాని)ని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలని..

పారిశుధ్య కార్మికులు ఖాళీ ప్లేట్లతో నిరసన

ఎంపిడిఒ ఆఫీసు వద్ద ఖాళీ ప్లేట్లతో ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

మండలంలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు తక్షణమే జీతాల బకాయిలు చెల్లించాలని కోరుతూ సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఖాళీ ప్లేట్లతో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మండలంలోని 32 పంచాయతీల నుండి పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరై వేతన బకాయిలు చెల్లించాలని పెద్ద పెట్టున నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు 3 నుండి 13 నెలలు వరకు జీతాలు అందకపోవడంతో ఆకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొర జీతాలతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తుందన్నారు. ఇచ్చే అతి తక్కువ వేతనాలు కూడా సకాలంలో చెల్లించకపోతే వారు ఏమి తిని బతకాలని ప్రశ్నించారు. విజయరామరాజుపేటలో 3 నెలలు, తురకలపూడిలో 13 నెలలు, బుచ్చయ్యపేటలో 6 నెలలు, రాజాంలో 13 నెలలు, బంగారుమెట్టలో 4 నెలలు ఇలా అన్ని పంచాయతీల్లోనూ బకాయిలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించి న్యాయం చేయాలని కోరారు. పంచాయతీల్లో టెండర్ విధానం రద్దు చేసి జిఓ ప్రకారం 10 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పిఎఫ్, యూనిఫామ్, ప్రమాద బీమా, నూనె, మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సాంబశివరావు, ఎన్వి నాయుడు, కార్మికులు ఒలమేరక ఏసు, బెల్లంకి నూకరాజు, బొర్రా అమ్మాజీ, ఈతలపాక శ్రీను, మరియమ్మ, ఎలుసూరి కొండబాబు, జి.ప్రసాద్, రాజు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. అనంతరం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు.

ఫార్మా కాలుష్యం నుండి ప్రజలను రక్షించాలి

కాలుష్య జలాలను పరిశీలిస్తున్న సిపిఎం నేత కోటేశ్వరరావు

ప్రజాశక్తి-రాంబిల్లి : ఫార్మా కాలుష్యం నుండి ప్రజలను రక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. రాంబిల్లిలోని లాలంకోడూరు, ఎరకన్నగారి ఇల్లు, చాటమెట్ట, సీతపాలెం, రామచంద్రపురం, పెదయాత్ర పాలెం, తోటవీధి తదితర గ్రామాలు సిపిఎం నాయకులు పర్యటించారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల పరిధిలోని సెజ్, ఫార్మా కంపెనీల నుండి విడుదలవుతున్న విషవాయువులు, వ్యర్థ రసాయన జలాలు వలన ఆయా గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా చూశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కంపెనీలు స్థాపించినప్పుడు ఎటువంటి కాలుష్యం ఉండదని, ఈ ప్రాంతమంతా ఎంతో అభివృద్ధి చెందుతుందని అధికారులు, పాలకులు గొప్పలు చెప్పారని, నేడు అందుకు విరుద్ధంగా ఆయా గ్రామాలు కాలుష్యం బారిన పడ్డాయని పేర్కొన్నారు. ఈ గ్రామాల ప్రజలు గుండె జబ్బులు, కిడ్నీ, లివర్, కీళ్ల నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పంట పొలాలు మీద నుండి ఫార్మా కంపెనీలు విడుదల చేస్తున్న వ్యర్థ రసాయన జలాలు ప్రవహిస్తూ సముద్రంలో చేరడం వలన, ఇటు రైతులకు, అటు మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ రసాయన వ్యర్థ జలాలు తాగి పశువులు మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. ఇంత జరుగుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులుగాని, ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు గాని పట్టించుకోకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా కాలుష్యాన్ని అరికట్టే విధంగా కంపెనీలపై చర్యలు చేపట్టాలని, లేకుంటే ఆయా కంపెనీల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జి.దేవుడు నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు ఆర్.రాము, నాయకులు ఎన్.నారాయణరావు, సిహెచ్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతో ఉపాధి హామీ పనుల కల్పన

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఉపాధి హామీ కూలీలు చేసిన పోరాటంతోనే అధికారులు పనులు కల్పించినట్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు తెలిపారు. మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో ఉపాధి కూలీలతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాము, అప్పారావు మాట్లాడుతూ పోరాటంతోనే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఉపాధి హామీ పనులకై తిమ్మరాజుపేట గ్రామ సచివాలయం ఆవరణలోనూ, మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోనూ రెండుసార్లు ఆందోళన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వామపక్ష పార్టీల పోరాట ఫలితంగానే ఉపాధి హామీ చట్టం వచ్చిందని, ఇప్పుడు దానిని రక్షించుకోవడానికి పోరాటాలే మార్గమని స్పష్టం చేశారు. నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించి దీనిని నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుందని, దానిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించాలని, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శరగడం రామనాయుడు, నడిపూరి సన్యాసిరావు, చెల్లిబోయిన అప్పారావు, కూలీలు పాల్గొన్నారు.

నీటి తొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చోడవరం : మండలంలోని దుద్దుపాలెం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నీటి తొట్టెలు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువుల దాహార్తిని తీర్చడానికి నీటి తొట్టెలు ఎంత ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పివిఎస్.ఆంజనేయులు, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ నాగ గంగాధర్, మాజీ జెడ్పిటిసి కనిశెట్టి సన్యాసిరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైసిపి యువజన విభాగం అధ్యక్షునిగా దివాకర్

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం వైఎస్ఆర్‌సిపి యువజన విభాగం అధ్యక్షులుగా నీటిపల్లి దివాకర్, మండల మహిళా విభాగం అధ్యక్షులుగా తగరంపూడి నూకరత్నంను నియమించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సిపి అనకాపల్లి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ మలశాల భరత్ కుమార్ వీరిని అభినందించారు. భరత్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని ప్రచారం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని కోరుతూ మండలంలోని పోలేపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం ఆ గ్రామంలో ఇంటి ఇంటికి తిరిగి ప్రచారం చేశారు. 8 మంది పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు అంగీకారం తెలిపినట్లు ప్రధానోపాధ్యాయులు పిసిహెచ్ పాత్రుడు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగరత్నం, వరలక్ష్మి, సిఆర్‌పి జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని కేపీ అగ్రహారం చెరువులో ఉపాధి హామీ పనులను సర్పంచ్ గోపిశెట్టి శ్రీను, ఎంపిటిసి దేవర అప్పారావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అడ్డూరి శ్రీను, తురుబిల్లి నూకరాజు, దేవర భూలినాయుడు, జనసేన మండల కార్యదర్శి సుంకర శ్రీను, నీటి సంఘం వైస్ చైర్మన్ అద్దేపల్లి గోవింద తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని మూడు అంగన్వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు స్థానిక ఐసిడిఎస్ పిఒ మంగతాయారు తెలిపారు. మండలంలోని పోతనవలస (బిసి), కె.సంతపాలెం శివారు కేకే.అగ్రహారం (ఓసి), కింతాడ శివారు రామచంద్రపురం (బిసి) అంగన్వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వీటి కోసం ఈనెల 17లోపు మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 21 నుండి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండి పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని, వితంతువు అయివుంటే భర్త మరణ ధ్రువీకరణ పత్రం, వితంతువుకు మైనర్ పిల్లలు ఉన్నట్లయితే వారి జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జత చేయాలని కోరారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పిఒ వెల్లడించారు.

బస్సు ఏర్పాటు

ప్రజాశక్తి-వడ్డాది : తగరపువలస ఎన్ఆర్ఐ అనిల్ నీరుకొండ హాస్పిటల్‌లో ఉచిత వైద్య సేవలకు కోసం పేద ప్రజలకు బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం విఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వడ్డి సత్యారావు సోమవారం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. మండలంలోని లోపూడి, ఎల్.సింగవరం గ్రామాల నుంచి పేదలు వైద్యం నిమిత్తం వెళ్లారు. గైనిక్, ఆర్థో, ఈఎన్టీ, జనరల్ తదితర రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి ఆపరేషన్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వేపాడ మధు సర్పంచ్, రేణం శివ పాల్గొన్నారు.

గిరిజనేతరుడు జర్తా లక్ష్మణరావుకు ఇచ్చిన మైనింగ్ అనుమతులు రద్దు చేయాలి

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సుందరకోట పంచాయతీ బమిడికలొద్ది, అసనగిరి గ్రామాల సరిహద్దుల్లో గిరిజనేతరుడైన జర్తా లక్ష్మణరావుకు మంజూరు చేసిన సుమారు 300 ఎకరాల లేటరైట్ మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని, 5వ షెడ్యూల్ ఏరియా చట్టం 1950, అటవీ హక్కుల చట్ట ప్రయోజనాలు రక్షించి, గిరిజనులను కాపాడాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు సోమవారం సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు లేఖ రాశారు. గిరిజనుల చట్టాలను ఉల్లంఘించి రాష్ట్ర ప్రభుత్వం 20 ఏళ్ల పాటు లక్ష్మణరావుకు లీజును ఇస్తూ తవ్వకాలకు అనుమతి ఇవ్వడం గిరిజనుల జీవనాన్ని దెబ్బతీయటమే అవుతుందన్నారు. నర్సీపట్నం డివిజన్లో గొలుగొండ పర్వత శ్రేణుల్లో గిరిజన ప్రాంతాలను షెడ్యూల్ జిల్లా చట్టం 1874 ప్రకారం ఏజెన్సీ ప్రాంతంగా నోటిఫై చేసిందని తెలిపారు. ఈ ప్రాంతాల్లో సుమారు 16 గ్రామాల్లో 9000 గిరిజన కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. వారిని పరిగణనలోకి తీసుకోకుండా ఐదవ షెడ్యూల్ చట్టం, అటవీ హక్కుల చట్టం 2006, పీసా చట్టం నిబంధనలను ఉల్లంఘించి లేటరైట్ మైనింగ్ తవ్వకాలకు గిరిజనేతరులు, బినామీలకు అనుమతి ఇవ్వడం ఇది రాజ్యాంగ నియమాలు, గిరిజన చట్టాలకు విరుద్ధమన్నారు. గిరిజన గ్రామాల స్వరూపాలను మార్చడంతో గిరిజనులు అనేక విధాలుగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ అక్రమాలపై దర్యాప్తు జరిపి విలువైన ఖనిజ సంపదను అక్రమంగా దోపిడీ చేస్తున్న వారిపైనా, గిరిజన, అటవీ, పర్యావరణ, ఖనిజ నియంత్రణ చట్టాలను ఉల్లంఘిస్తున్న అధికారులపైన ప్రైవేటు వ్యక్తులపైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

బైకల చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్టు

- 9 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడగిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి 9 బైకులు స్వాధీనం చేసుకున్నారు. బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్లో సోమవారం అనకాపల్లి డిఎస్పి ఎం.శ్రావణి కేసు వివరాలను వెల్లడించారు. మండలంలోని విజయరామరాజుపేటకు చెందిన ముగ్గురు యువకులు నెంబర్ ప్లేట్లు లేకుండా రెండు ద్విచక్ర వాహనాలపై బుచ్చయ్యపేట నుండి రాజాం వైపు వెళతుండగా కందిపూడి జంక్షన్లో బుచ్చయ్యపేట పోలీసులు నిలిపి విచారణ చేశారు. ఎస్ఐ ఎ.శ్రీనివాసరావు నిందితులను బైకుల డాక్యుమెంట్లు అడగగా అనుమానాస్పదంగా తడబడుతూ పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో పోలీసులు వారిని చుట్టుముట్టిఅదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ చేయగా బైకులు దొంగతనం చేస్తున్నట్లు ఒప్పుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వివిధ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడిన 9 ద్విచక్ర వాహనాలను వారి నుండి స్వాధీనం చేసుకున్నారు. బుచ్చయ్యపేట, చోడవరం, దువ్వాడ, వైజాగ్ ఫోర్ట్ టౌన్, కంచరపాలెం, అనకాపల్లి పోలీసు స్టేషన్ల పరిధిలో ఒక్కో బైక్, మల్కాపురం పిఎస్ పరిధిలో మూడు బైకులు వీరు దొంగతనాలకు పాల్పడినట్లు నిర్ధారించారు. సదరు వాహనాలను ఆయా పోలీస్ స్టేషన్లకు పంపిస్తామని డిఎస్‌పి తెలిపారు. చెడు వ్యసనాలకు అలవాటు పడిన వీరు కొంతకాలంగా బైకులు దొంగతనం చేసి అమ్ముకుంటున్నారని తమ విచారణలో తేలిందన్నారు. సమర్థవంతంగా విచారణ చేసిన బుచ్చిపేట ఎస్సై ఎ.శ్రీనివాసరావును, సిబ్బందిని డిఎస్పి అభినందించారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదు

ప్రజాశక్తి-అనకాపల్లి : హత్య కేసులో నిందితునికి జీవిత ఖైదుతో, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ అనకాపల్లి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్టు తీర్పునిచ్చింది. ఈ మేరకు ఎస్పీ తుహిన్ సిన్హా సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనకాపల్లి జిల్లా కశింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో 2018 జూన్ 8న శర్వణ్ కుమార్ గణపతి, కన్నన్ మునిరాజు ఇద్దరూ కంటైనర్ లారీలో కశింకోట హైవే సమీపంలోని కాళీ ప్రసాద్ పెట్రోల్ బంక్ వద్దకు చేరుకున్నారు. అక్కడ భోజనం చేసిన అనంతరం మునిరాజు, శర్వణ్ కుమార్ సరదాగా ఆడుకున్న ఘటనపై ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగ్గా వారిని లారీ డ్రైవర్లు విడిపించారు. అనంతరం, మునిరాజు పెట్రోల్ బంక్ సమీపంలోని గుట్టపై విశ్రమిస్తుండగా, శర్వణ్ కుమార్ ఆవేశంతో ముని రాజ్‌పై కాంక్రీట్ రాయితో దాడి చేసి తలపై తీవ్రంగా గాయపరిచాడు. తీవ్ర రక్తస్రావం కారణంగా మునిరాజును స్థానికులు ఆస్పత్రికి తరలించగా మునిరాజు మరణించాడు. దీంతో కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. కేసు విచారణ అనంతరం అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు తీర్పు చెప్పినట్లు తెలిపారు.

బాలికలకు ఉచితంగా ఇంటర్ విద్య

ప్రజాశక్తి- అనకాపల్లి : పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలకు ఉచితంగా ఇంటర్మీడియట్ చదువుకునే అవకాశాన్ని స్థానిక ఆదినారాయణ మహిళ జూనియర్ కళాశాల కల్పిస్తున్నట్టు కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్, డైరెక్టర్ అనూష సుబ్రహ్మణ్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొణతాల సుబ్రహ్మణ్యం అప్పలనర్సమ్మ ట్రస్టు ద్వారా బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, ఎంఇసి కోర్సుల్లో రెండు సంవత్సరాల పాటు ఉచితంగా అందించే ఇంటర్మీడియట్ కోర్సుకు విద్యార్థినుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 8522913422, 7901511296 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

విద్యుత్ వైర్లు మార్చాలని ధర్నా

ప్రజాశక్తి-చోడవరం : ప్రమాదకరమైన విద్యుత్ వైర్లని మార్చాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక ఐటిఐ కాలనీవాసులు విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ ఐటిఐ కాలనీలోని ఇంటిపై నుండి ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు ఉన్నాయని, ఈ విషయాన్ని విద్యుత్ అధికారులకు తెలిజేస్తే తూతూ మంత్రంగా పరిశీలించి, ఎస్టిమేషన్ చార్జీలు పెట్టుకోవాలని వెళ్లిపోయారని తెలిపారు. ఏదైనా విద్యుత్ ప్రమాదం సంభవిస్తే దానికి విద్యుత్ అధికారులే బాధ్యులవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు జలగడుగులు అప్పలరాజు, పొట్నూరు అరుణ, గణేష్, శివ పాల్గొన్నారు.

వేసవి నీటి ఎద్దడి నివారణకు చర్యలు

అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

వేసవి కాలన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, ప్రతి గ్రామ పంచాయతీలో శత శాతం వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చెయ్యాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఎంపీడీఓలను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం తన ఛాంబర్ నుంచి జిల్లా అధికారులు, మండల అభివృద్ధి అధికారులతో గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపడుతున్న సర్వేలు, ఎన్‌డబ్ల్యుపిసి షెడ్లు, గ్రామీణ నీటి సరఫరా, జి.ఎస్.డబ్ల్యు.ఎస్ సర్వే, గృహ నిర్మాణం, పంచాయతీ రాజ్, డ్వామా శాఖలపై, బిసి కార్పొరేషన్ యూనిట్ల మంజూరు, ఉపాధిహామీ, చలివేంద్రాలు ఏర్పాటు అంశాలపై జిల్లా కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న సర్వేలన్నింటిని త్వరతగతిన పూర్తిచేయాలన్నారు. ఉపాధి హామీకి సంబంధించిన పనులను, కేటాయించిన పనిదినాల లక్ష్యాలను పూర్తిచేయ్యాలని, ఉపాధికూలీలకు మంచినీరు అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో 500 పశువుల నీటి తొట్టెలను మంజూరు చేశామని, వాటి నిర్మాణాలు పూర్తిచేసి నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. గిరి శిఖర గ్రామాలలో మంచినీటికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. గామాలలో పారిశుద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పశు సంవర్ధక శాఖ కు సంబందించిన గోకులం షెడ్డులను త్వరతగతిన పూర్తి చెయ్యాలని ఆదేశించారు. గృహ నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఈ నెల 11 జరగబోయే జ్యోతిరావుపులే జయంతిని పురస్కరించుకొని బిసి కార్పొరేషన్ ద్వారా 400 యూనిట్లను మంజూరు చేసి లబ్దిదారులకు అందజేసేందుకు తగిన ఏర్పాట్లు చెయ్యాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పంచాయతి అధికారి శిరీషా రాణి, జెడ్పీ సిఈఓ నారాయణ మూర్తి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ శచిదేవి, డ్వామా పిడి పి.పూర్ణిమ దేవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ ఎన్ఎ.రామస్వామి, డిపిఆర్పీ జిల్లా కో ఆర్డినేటర్ నాగలక్ష్మి, జిల్లా వెనుకబడిన తరగతుల కార్యనిర్వహణ డైరెక్టర్ పెంటోజీరావు, జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, పంచాయత్ రాజ్ డిఇలు, జెఇలు పాల్గొన్నారు.

పబ్లిక్ గ్రీవెన్స్‌కు జిల్లా అధికారులు హాజరవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరు హాజరుకావాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పి.జి.ఆర్.ఎస్. కార్యక్రమంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, జాయింటు కలెక్టరు ఎమ్. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్.సుబ్బలక్ష్మి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజల నుండి తీసుకున్న అర్జీలపై వెంటనే సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో పెండింగు అర్జీలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రజల నుండి వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా అధికారులు మాత్రమే హాజరుకావాలని, దిగువస్థాయి సిబ్బందికి పంపించకూడదని ఆదేశించారు. డివిజను, మండల, గ్రామస్థాయిలలో నిర్వహించే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి సంబంధిత అధికారులు తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. విభిన్న ప్రతిభావంతులు, వృద్ధులైన అర్జీదారుల నుండి పత్యేక డిప్యూటీ కలెక్టరు ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి నేరుగా వారి వద్దకు వెళ్లి ఫిర్యాదులు స్వీకరించారు. అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో 42 ఫిర్యాదులు

అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 42 ఫిర్యాదులు అందాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసపూరిత వ్యవహారాలు వంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. ఎస్పీ స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదులన్నింటిపైనా చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్సై డి.వెంకన్న పాల్గొన్నారు.

7వ రోజుకు క్వారీ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-అనకాపల్లి : క్వారీ డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె సోమవారానికి ఏడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా జనరల్ సెక్రెటరీ కోన మోహన్‌రావు మాట్లాడుతూ గత ఏడు రోజులుగా పనులు నిలిపివేసి సమ్మె చేస్తున్నా, యాజమాన్యాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కార్మికుల కష్టంతోనే ఉత్పత్తి పెరిగి లాభాలు గడించడం అలవాటైన యజమానులకు కార్మికుల శ్రమను గుర్తించడానికి నిరాకరిస్తున్నారని వాపోయారు. కార్మికులు కూలీ రేట్లు తేల్చకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల గిట్టుబాటు అయ్యే కూలీ రేట్లు, 11వ వేతన ఒప్పందాన్ని సాధించుకునే అంతవరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. క్వారీ కార్మిక సంఘ నాయకులు చింతల రమేష్, సిహెచ్ చిన్నారావు, జె మహేష్ ఎస్ సూరిబాబు జి.తాతబాబు పాల్గొన్నారు.

బుడగ జంగాల కాలనీలో తాగునీరు, డ్రెయినేజీల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు

కె.కోటపాడు మేజర్ పంచాయతీ పరిధిలో బుడగ జంగాల కాలనీలో డ్రెయినేజీలు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, సిఐటియు మండల కార్యదర్శి ఈర్లె నాయుడుబాబు, ఎపి కల్లుగీతకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి యర్రా దేముడు తదితరులు బుడగ జంగాల కాలనీలో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో బుడగ జంగాలకు తెగకు చెందిన 50 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారని, కాలనీలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, శుక్రవారం నాటి వర్షానికి డ్రైనేజ్ పొంగి ఇంట్లోకి వచ్చిందని తెలిపారు. గతంలో ఓ అమ్మాయి కాలువలో పడి చనిపోయిందన్నారు. దోమలతో తరచూ మలేరియా, డెంగ్యూ జ్వరాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని కోరారు. వెంటనే ఈ సమస్యలను పరిష్కరించకుంటే ఎంపిడిఓ కార్యాలయం ఎదుట ఆందోళన ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

నగదు రూపంలోనే నష్టపరిహారం చెల్లించాలి

- నాగులపల్లి గ్రామసభలో స్పష్టం చేసిన నిర్వాసితులు

ప్రజాశక్తి-మునగపాక

అనకాపల్లి -అచ్యుతాపురం రోడ్డు విస్తరణలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు నగదు రూపంలోనే నష్టపరిహారం అందజేయాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. మండలంలోని నాగులపల్లి గ్రామ సచివాలయంలో అధికారులు నిర్వాసితులతో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు టిడిఆర్ బాండ్లను వ్యతిరేకించారు. నిర్వాసిత నాయకుడు ఆడారి గణపతి అచ్చం నాయుడు మాట్లాడుతూ టిడిఆర్ బాండ్ల రూపంలో రెట్టింపు నగదు వస్తుందని చెప్పడం బాగుందని, కానీ ఆ బాండ్లు మీరే తీసుకుని నగదు రూపంలో నిర్వాసితులకు అందజేస్తే సంతోషిస్తామని పేర్కొన్నారు. నిర్వాసిత సంఘ కన్వీనర్ ఆర్ రాము, సిపిఎం నాయకులు ఎస్ బ్రహ్మాజీ మాట్లాడుతూ 2023లో జరిగిన గ్రామసభలో నాటి ఆర్డీవో నిర్వాసితులకు నగదు రూపంలోనే నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పారని, ఇప్పుడు టిడిఆర్ బాండ్లు ఇస్తామని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. టిడిఆర్ బాండ్లు నగదు రూపంలో మార్చుకోవడం గ్రామీణ ప్రాంత వాసులకు కత్తి మీద సాము వంటిదన్నారు. 2013 భూ సేకరణ చట్ట ప్రకారంగా నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్డిఓ ఆయేషా, ఎమ్మార్వో ఆదిమహేశ్వరరావు, నిర్వాసితులు మల్ల రాజారావు, దొడ్డి శ్రీనివాసరావు, సూరిశెట్టి చూడామణి బొడ్డెడ సీతారాం, రమణాజీ పాల్గొన్నారు.

గ్రామసభలో మాట్లాడుతున్న నిర్వాసిత మహిళ

మొక్కుబడిగా మండల సమావేశం

మాట్లాడుతున్న ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రోలుగుంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. శాఖలవారీ సమీక్షలు, ప్రజాసమస్యలపై చర్యలు, సమాధానాలు లేకుండా సమావేశం అయిందనిపించారు. కుసర్లపూడి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో కుళాయిలు వేసినా, పనులు పూర్తి కానందున తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. జగనన్న కాలనీలో వాటర్ ట్యాంకు, రెండు బోర్లు ఏర్పాటుచేసినా, బోరు నుండి రంగుమారిన నీరు రావడంతో తాగడానికి వీలు లేని పరిస్థితి ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వచ్చే నీరు ఎర్రగా ఉందని తాగడానికి అవకాశం లేదని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. జె.నాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న స్కూల్ కాంప్లెక్స్‌ను రద్దు చేయడంపై ఎంపిటిసి జి.జగది ప్రశ్నించారు. రద్దుచేసిన స్కూల్ కాంప్లెక్స్‌ను పునరుద్ధరించాలన్నారు. దీనిపై ఎంఇఒ జగ్గారావు స్పందిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్‌లను కుదించారని, అందులో భాగంగా మండలంలోని నాలుగు స్కూల్ కాంప్లెక్స్‌లను మూడింటికి కుదించడంతో జె.నాయుడుపాలెంలో రద్దయిందన్నారు. సమావేశంలో ఎంపిడిఒ నాగేశ్వరరావు, తహశీల్దార్ నాగమ్మ, ఎంపిడిఒ నాగేశ్వరరావు, పలు శాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ రమణ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని నర్సీపట్నం ఆర్‌డిఒ వివి.రమణ అన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఫిర్యాదులను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కార మార్గం చూపాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కార్యాలయ పరిపాలనాధికారి సూర్యనారాయణ, తహశీల్దార్ రామారావు, అధికారులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం

ప్రజాశక్తి-రోలుగుంట : అవార్డులు పొందిన ఉపాధ్యాయులను సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు సహదేవుడు, రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లీషు టీచర్ పివిఎం.నాగజ్యోతి, కుసర్లపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ సోషల్ టీచర్ వృక్షమిత్ర రాంబాబు మాస్టార్‌ను ఘనంగా సత్కరించారు. తహశీల్దార్ నాగమ్మ, ఎంఇఒ జగ్గారావు పాల్గొన్నారు.

11న కలెక్టరేట్ల వద్ద బిసిల సమరభేరి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : బిఎస్‌పి ఆధ్వర్యంలో ఈనెల 11న జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే బిసి సమరభేరిని జయప్రదం చేయాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొట్టా నాగరాజు తెలిపారు. సోమవారం నర్సీపట్నం పార్టీ కార్యాలయంలో బిసి సమరభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకులు కొల్లి గంగాధర్, సంజీవ్, చిటికెల అప్పలనాయుడు, ఎన్.అప్పారావు, మహేష్, సూరిబాబు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

▸▸ ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి

జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి - మాడుగుల : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించి, వెనుకబడిన మాడుగుల నియోజకవర్గాన్ని ముందుకు నడిపించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి పేర్కొన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మెగా ఉద్యోగమేళాలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అత్యధిక శాతం యువత నిరుద్యోగులుగా ఉన్నారని, రాబోయే నాలుగేళ్లలో అందరికీ ఉద్యోగం, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. నిరుద్యోగ యువత స్వయం ఉపాధికి రాయితీ రుణాలను అందజేస్తున్నామని, వాటినీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎపి సీడ్ జెడిఎం ఆళ్ల కళ్యాణి మాట్లాడుతూ జాబ్‌మేళాలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న వారికి భోజనం, వసతి, అన్ని సౌకర్యాలు కల్పిస్తూ 13 సెంటర్లల్లో శిక్షణనిచ్చి, నెలకు రూ.13వేలు నుంచి రూ.18వేలు వేతనంతో ఎంఎన్‌సిల్లో ఉద్యోగావకాశాన్ని కల్పిసామన్నారు. ఎమ్మెల్యే సత్యన్నారాయణమూర్తి ఆదేశాలతో డిఆర్‌డిఎ పీడీ కె.శచీదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపిపి తాళ్లపురెడ్డి రాజారాం. మాజీ ఎంపిపి పుప్పాల అప్పలరాజు టిడిపి మండల అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు,కార్యదర్శి ఉండూరు దేముడు, డేటాప్రో కంప్యూటర్ ప్రైవేట్ లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్ కె మహంతి, క్రైట్ స్కిల్ ప్రైవేట్ లిమిటెడ్ సూపర్వైజర్ రామానాయుడు, పాల్గొన్నారు.

కీళ్ల మార్పిడికి రోబోటిక్ ఆపరేషన్

▸▸ మెడికవర్ ఆసుపత్రిలో అధునాతన మిస్సో ఆర్థో సర్జికల్ రోబోట్ ప్రారంభం

ఆర్థో సర్జికల్ రోబోట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : రోబోటిక్ విధానం ద్వారా మోకాళ్ళ సమస్యలను నయం చేసే మిస్సో ఆర్థోసర్జికల్ రోబోట్‌ను విశాఖ నగరంలోని మెడికవర్ హాస్పిటల్‌లో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ మెడికల్ రోబోటిక్స్ వైద్యవిధానం ద్వారా రోగులకు ఎంతో స్వాంతన చేకూరుతుందని ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. అనంతరం ఆర్థోపెడిక్ విభాగం హెడ్ డాక్టర్ ఎ.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు మోకాళ్ళమార్పిడి ద్వారా వైద్యప్రక్రియను కొనసాగిస్తున్నామని, తాజాగా ప్రారంభించిన రోబోటిక్ విధానంతో 24 గంటల్లోనే రోగి కోలుకుంటారని వివరించారు. మోకాళ్ళ మార్పిడి చేపట్టిన సందర్భంలో నొప్పి అధికంగా ఉంటుందని, వృద్ధాప్యంలో ఎటువంటి సమస్యలు ఉంటాయోనని మానసికంగా కొందరు కలత చెందుతారన్నారు. అయితే రోబోటిక్ విధానంతో అటువంటి భయాందోళనలు అవసరం లేదన్నారు డాక్టర్ గంగవరపు శ్రీధర్ మాట్లాడుతూ మోకాళ్ళ మార్పిడి అనంతరం ఇతర సమస్యలు తలెత్తకుండా ఐసియులో ఉంచుతామని, రోబోటిక్ విధానంతో త్వరితగతిన కోలుకోవచ్చున్నారు. ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు డాక్టర్ యస్.ప్రవీణ్, డాక్టర్ యన్.వి.యస్.వినయ్ మాట్లాడుతూ రోబోను ఉపయోగించడం వలన కచ్చితత్వం, తక్కువ రక్తస్రావం, త్వరితంగా కోలుకోవడం వంటి ప్రయోజనాలున్నాయన్నారు. కార్యక్రమంలో ఎపి రీజనల్ హెడ్ పద్మజ, సెంటర్ హెడ్ అరుణ్ పాల్గొన్నారు.

రూ.7.80 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

శంకుస్థాపనలు చేస్తున్న పద్మావతి, విజయ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి, కౌన్సిలర్ చింతకాయల పద్మావతి, టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి చింతకాయల విజయ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రతి వార్డులోనూ మహిళలు హారతులతో వీరికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చింతకాయల విజయ్ మాట్లాడుతూ గత పాలకులు పట్టించుకోని 28వ వార్డు ప్రస్తుతం అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల వ్యవధిలోనే 28వ వార్డులో రూ.1.8కోట్లు, ఒకటి రెండు వార్డులకు రూ.1.50 కోట్లతో ఎనిమిది అభివృద్ధి పనుల చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో మట్టిరోడ్లు అనేవి లేకుండా చేసి అన్ని వీధుల్లోనూ సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. పెద్ద చెరువును రూ.4.50 కోట్లతో హైదరాబాద్ ట్యాంక్‌బండ్ తరహాలో అభివృద్ధి చేయనున్నామని వివరించారు. పట్టణాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఇచ్చిన హామీలన్నీ ఒక్కటొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వహయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన నర్సీపట్నాన్ని, కూటమి పాలనలో సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.

కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ,గడచిన నాలుగేళ్లలో26వ వార్డు కౌన్సిలర్‌గా వీధిలైట్లు కూడా వేయించుకోలేకపోయానని, దీంతో ప్రజల ఇబ్బందులు చూడలేక సొంత నిధులతో పనులు చేపట్టామన్నారు. చివరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు సహకారంతో రూ.40 లక్షలతో పలు పనులకు శ్రీకారం చుట్టామన్నారు. శంకుస్థాపన చేసిన పనులన్నీ . మూడు నెలల్లో పూర్తవుతాయని స్పష్టం చేశారు. ఏరియా ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం గదిని అభివృద్ధి విషయాన్ని కమిటీ సమావేశంలో ప్రస్తావిస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు, ఆయా వార్డు ప్రజలు పాల్గొన్నారు.

నీటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేయండి

ప్రజాశక్తి-కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాల్లో నీటి తీరువా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని విఆర్‌ఒలు, ఇతర సిబ్బందికి తహశీల్దార్ తిరుమల బాబు సూచించారు. సోమవారం స్థానిక మండల రెవన్యూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గ్రామీణ ప్రాంతాల్లో దుగ్గాడ ఛానల్, తాండవ చానల్, వరహానది కాలువలు కింద గల ఆయికట్టు వివరాలను సేకరించి పన్నులు వసూలు చేయాలని సూచించారు, పెండింగ్ లో ఉన్న వివిధ దరఖాస్తులను సకాలంలో పరిశీలించాలని, విద్యార్థులకు అవసరమైన ధ్రుపత్రాల మంజూరులో నిర్లక్ష్యం చేయరాదని సూచించారు, సిబ్బంది సమయపాలన పాటించి రైతులకు ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు, కార్యక్రమంలో డిటి రమేష్, ఆర్ ఐ ఊర్తవరావు, మండల సర్వేయర్ శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ అధికారులు విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తిని తీర్చండి

ప్రజాశక్తి -ఎంవిపికాలనీ.: వేసవిలో మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జివిఎంసి అదనపు కమిషనర్ ఆర్.సోమనారాయణ అన్నారు. సోమవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో గురుద్వార జంక్షన్‌కు చెందిన యానిమల్ వెల్ఫేర్ యాక్టివిటీ అనే సంస్థ జంతు ప్రేమికులకు జివిఎంసి గుర్తింపు కార్డులను అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇఎన్‌వి నరేష్ కుమార్‌తో కలిసి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు నగరంలో పలుచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేస్తారని, అదేమా పశువులు, కుక్కలు, పక్షులు వంటి మూగజీవాల దాహార్తిని తీర్చేందుకు జివిఎంసి తనవంతు కృషి చేస్తోందని, సహకరించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నగరంలో నిర్దేశించిన 300 చోట్ల జంతువులకు పక్షులకు, కుక్కలకు నీటి తొట్లతో పాటు ఆహారాన్ని స్వచ్ఛందంగా అందిస్తారన్నారు. కార్యక్రమంలో జివిఎంసి సిటీ వెటర్నరీ అధికారి డాక్టర్ ఎన్.కిషోర్, స్థాయి సంఘం సభ్యులు శరగడం రాజశేఖర్, కార్పొరేటర్ రాపర్తి కన్నారావు, ఫైనాన్సు అడ్వైజర్ మల్లికాంబ, యానిమల్ వెల్ఫేర్ యాక్టివిటీ ప్రతినిధి హరిత పాల్గొన్నారు.

మత్స్యకారులకు ఎల్‌పిసిలు ఇవ్వాలి

జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదుకు వచ్చిన కూటమి నేతలు

ప్రజాశక్తి- నక్కపల్లి : మండలంలోని రాజయ్యపేటలో 289, 290 సర్వేనెంబర్లలో నివాసముంటున్న మత్స్యకారులకు హౌసింగ్ స్కీములో కొత్త ఇళ్ల నిర్మించుకునేందుకు ఎల్‌పిసిలు ఇవ్వాలని గ్రామానికి చెందిన కూటమి నాయకులు కోరారు. సోమవారం అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

రాజయ్యపేటలో 289, 290 సర్వేనెంబర్లలో పూర్వం నుండి వేలాది మంది మత్స్యకారులు నివాసమంటున్నారని, వారికి 2009, 2014లో ఎల్‌పిసిలు ఇచ్చినా, వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఐదేళ్లలో ఎల్‌పిసిలు నిలుపుదల చేశారన్నారు. దీంతో మత్స్యకారులు ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు పడే పరిస్థితి ఉందన్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 120 మంది లబ్ధిదారులకు హౌసింగ్ స్కీం ద్వారా ఇల్లులు మంజూరైనట్లు తెలిపారు. వీరందరికీ ఎల్‌పిసిలు ఇచ్చి ఇళ్ల నిర్మాణాలకు సహకరించి, న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వారిలో ఎంపిటిసి పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు, జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు, మత్స్యకార నేతలు వాసపల్లి శివాజీ, మడదా రాంబాబు, చేపల రామకృష్ణ, పిక్కి గోపి పాల్గొన్నారు.

ఛానల్ పునరుద్ధరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలోని పాములవాక గ్రామంలో ఏలూరు కాలువ లీడ్ ఛానల్‌పై రూ.50 లక్షలతో పునరుద్ధరణ పనులను జివిఎంసి డిఇఇ వెంకటరావు ఆధ్వర్యంలో స్థానిక నాయకులు వేచలపు జనార్దన్, కిల్లడ శ్రీనివాసరావుసోమవారం ప్రారంభించారు, గతంలో రూ.2.50 కోట్లతో నిర్మించిన వాటర్ వర్చువల్ నిర్మాణంలో తలెత్తిన సాంకేతిక లోపాన్ని రూ.50 లక్షలతో పునరుద్ధరణకు పనులు చేపట్టనున్నారు. రైతులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపడతామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీహరి, వర్క్ ఇన్స్పెక్టర్ గోపి పాల్గొన్నారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి : పారదర్శకమైన ఓటరు జాబితా తయారీపై బూత్ స్థాయి అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఇఆర్‌ఒ గీతాంజలి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎఇఆర్‌ఒ నరసింహమూర్తి ఆధ్వర్యంలో బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా తయారీపై వారికి సూచనలు చేశారు. బూత్ స్థాయి అధికారుల బాధ్యతలను వివరించి, విధులు నిర్వహణపై శిక్షణనిచ్చారు.

నేడు శివయ్య కళ్యాణం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని ఉపమాక లక్ష్మణేశ్వరస్వామి దేవస్థానం, శివాలయంలో శివ,పార్వతుల వార్షిక కల్యాణోత్సవాలు ఈనెల 8 నుంచి 12వ తేదీ వరకు జరగనున్నాయి. ఆలయ అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టునున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు నక్కపల్లిలో మైలభరపట్ల జోగారావు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సవాన్ని డాక్టర్ గొట్టుముక్కల గాయత్రీదేవి వ్యాఖ్యానంతో నిర్వహించనున్నారు. రాత్రి 8:30గంటల నుంచి శివాలయం వద్ద స్వామి వార్షికకల్యాణోత్సవం జరుగుతుంది. ఉత్సవాల్లో భాగంగా 9న కుంకుమ పూజ, 10న పండిత సభ, 11న తోట ఉత్సవం, 12 న పుష్ప యాగోత్సవం, పవళింప సేవతో ఉత్సవాలు ముగిస్తాయని ఆలయ అర్చకులు మహేష్ తెలిపారు. స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.కల్యాణం నిర్వహించేందుకు ఆలయం వద్ద తాత్కాలికంగా వేదిక ఏర్పాటు చేస్తున్నారు. శివపార్వతుల వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు.

సోలార్ ప్లాంట్లకు స్థలం కేటాయించండి

తహశీల్దార్‌తో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో అధికారులు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో దళితులు, గిరిజనులకు ఉచిత విద్యుత్ సరఫరాకు అవసరమైన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని తాహశీల్దార్ తిరుమలబాబును విద్యుత్ శాఖ అధికారులు సోమవారం కోరారు, మండల వ్యాప్తంగా ఆరు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరార. సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్తును ఎపిఇపిడిఎల్ ద్వారా కొనుగోలు చేసి, గిరిజనులకు ఉచిత కరెంటు ఇచ్చే ఉద్దేశంతో సోలార్ ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నట్లు తాహసిల్దార్‌కు వివరించారు, దీనిపై తహశీల్దార్ సానుకూలంగా స్పందించి, సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు నిర్ధేశించిన ప్రాంతాల్లో అవసరమైన స్థలాన్ని సేకరించాలని సిబ్బందికి సూచించారు,. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ సునీల్ కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్ పరమేశ్వరరావు, విఆర్ఒ అప్పారావు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు ఇంటర్వ్యూలు

ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారులు..

ప్రజాశక్తి- కోటవురట్ల : మండల పరిషత్ ఆవరణలో సోమవారం పరిపాలన అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వివిధ కులాల వారికి సబ్సిడీ రుణాలపై ఇంటర్వ్యూలు నిర్వహించారు, మండల వ్యాప్తంగా 367 మంది దరఖాస్తు చేసుకోగా, 224 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంకు,ఏపీజీవీబీ, డిసిసిబి, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు, కాగా ఇంటర్వ్యూకు హాజరైన వాళ్లలో ఎక్కువగా కూటమికి కార్యకర్తల అధికంగా ఉండడంతో, కార్పొరేషన్ రుణాలు కూటమి నాయకులకేనా అంటూ పలువురు చర్చించుకుంటున్నారు, 25 గ్రామాలకు గ్రామానికి కులాల వారీగా జనాభా ప్రాతిపదికన కులానికి రెండు లేదా మూడు చొప్పున స్వయంఉపాధి రాయితీ యూనిట్లు కేటాయించినట్లు తెలిసింది, వీటిల్లో కొన్ని వైసిపి నాయకులకూ కేటాయించడం విశేషం.

ఆదివాసీల సమస్యలు పరిష్కరిస్తా

- 'అడవితల్లి బాట'లో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - దుంబ్రిగుడ : ఆదివాసీల సమస్యలన్నీ పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భరోసానిచ్చారు. మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. అడవితల్లి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏజెన్సీ పర్యటనలో పెదపాడు ఆదివాసీ గిరిజన గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక గిరిజనులు సాంప్రదాయ థింసా నృత్యాలతో డిప్యూటీ సిఎంను స్వాగతించారు. గ్రామంలోని గర్భిణులు బాలింతలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులతో ముఖాముఖి ద్వారా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల,అంగన్వాడి భవనం, డ్రైనేజీ, తాగునీరు, వంతెన, సామాజిక భవనం, రచ్చబండఇలా పలు సమస్యలను విన్నవించగా, పరిష్కరిస్తానని హామీని ఇచ్చారు. గ్రామస్తులు పండించిన చిరుధాన్యాలు, అటవీ ఉత్పత్తులను ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.

అనంతరం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా పిఎం జన్‌మన్, పిఎంజిఎస్‌వై, ఎన్‌ఆర్ ఇజిఎస్, పిఆర్ఆర్, టిఎస్‌పి పథకాల ద్వారా మారుమూల గిరి గ్రామాలకు రూ.1005 కోట్లతో 1069 కిలోమీటర్లు రోడ్లు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడుతూ గిరిజనుల జీవనశైలి మారాలంటే, ప్రతిగ్రామానికి రోడ్డు సౌకర్యం ఉండాల్సిందేనని, వాటిని సాకారం చేస్తానన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రహదారులకు కేవలం రూ 99 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని ఆరోపించారు. మన్యంలో కూటమికి ఓట్లు లేకపోయినా, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. గిరిజనుల నమ్మకాన్ని వమ్ము చేయబోనని, మన్యంలో రహదారుల్లేని 1170 గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించి తీరుతామన్నారు.గిరిజన యువత గంజాయి, వ్యసనాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. పోలీసుల వికాస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పర్యావరణానికి, పర్యాటకానికి ఇబ్బంది లేకుండా చాపరాయి జలపాతం వద్ద వంతెన నిర్మాణం రెండునెలల్లో చేపడతామని స్పష్టం చేశారు..వచ్చే ఎన్నికల్లోనైనా మన్యంలో కూటమి పార్టీ జెండాలు రెపరెపలాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్ర, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ,మాజీ మంత్రి మణికుమారి, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జిసిసి చైర్మన్ శ్రవణ్ కుమార్, ఆర్‌టిసి విజయనగరం జోనల్ చైర్మన్ దొన్నుదొర, ఎంపిపి, జెడ్‌పిటిసిలు సిహెచ్ జానకమ్మ, బి ఈశ్వరి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్

కాగా దుంబ్రిగుడ పర్యటనలో డిప్యూటీ సిఎం పవన్‌కు వాలంటీర్లు నుంచి నిరసన సెగ ఎదురైంది. తమను కొనసాగించడంతోపాటు రూ.పదివేల గౌరవవేతనం ఇస్తామన్న హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని నిరసన చేపట్టారు. కాగా, పవన్ పర్యటన సందర్భంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా అనంతగిరి వారపుసంతను అధికారికంగా రద్దుచేయడంపై విమర్శలు వస్తున్నాయి.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి -నక్కపల్లి : ఈదురుగాలులకు అరటి తోటలు నేలమట్టమవ్వడంతో పంట నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వపరంగా ఆదుకొని నష్టపరిహారం చెల్లించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు కోరారు. సోమవారం బాధిత రైతులతో కలిసి, అనకాపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నక్కపల్లి మండలం చీడిక కొత్తూరు గ్రామంలో శనివారం సాయంత్రం అకస్మాత్తుగా ఈదురుగాలులు వీయడంతో అరటి చెట్లు విరిగిపోయి, పలువురు రైతులకు అపార నష్టం వాటిల్లిందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామానికి చెందిన కౌలు రైతు వీసం నర్సింగరావు చెందిన 5 ఎకరాలు, నగిరెడ్డి వెంకటేష్‌కు చెందిన ఎకరం, గోళ్ళ నరేంద్రకు చెందిన ఎకరం, కర్రి తమ్మారావుకు చెందిన 80 సెంట్లు, కర్రి నాగేశ్వరరావుకు చెందిన 2 ఎకరాలు, వెదుళ్ళ రాజుకు చెందిన రెండు ఎకరాలు, కౌలురైతు వీసం సత్యనారాయణకు చెందిన 2 ఎకరాల అరటి తోటలు ఈదురు గాలులకు పూర్తిగా దెబ్బతినడంతో అపార నష్టం జరిగిందన్నారు. దెబ్బతిన్న తోటలకు ఎకరానికి రూ.లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించి బాధిత రైతులకు ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ఉపసర్పంచ్ వరహాలుకు అభినందన

ఉపసర్పంచ్ వరహాలును అభినందిస్తున్న నేతలు

ప్రజాశక్తి- మాడుగుల : మాడుగుల గ్రామపంచాయతీ ఉప సర్పంచుగా సోమవారం బాధ్యతలు చేపట్టిన జవ్వాది వరహాలను పలువురు అభినందించారు. ఎంపిపి తాళ్లపు రెడ్డి వెంకటరాజారాం, ఎఎంసి మాజీ చైర్మన్ సేనాపతి కొండలరావు, జెడ్‌పిటిసి కిముడు రమణమ్మ., ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనాధు శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి. వైసిపి పట్టణ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీను, ఎంపిటిసిలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, కో ఆప్షన్ సభ్యురాలు షేక్ అహ్మద్ ఉన్నిసా, పంచాయతీ ఇఒ కె.మూర్తిబాబు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు కార్యాలయ సిబ్బంది సత్కరించి అభినందనలు తెలిపారు.

గొంతెండిపోతున్నా పట్టదా.?

- ఖాళీ బిందెలతో చలిసింగం గిరిజన మహిళల నిరసన
- జల్‌జీవన్ మిషన్ పనుల్లో కలెక్టర్ ఆదేశాలు బేఖాతరుపై మండిపాటు

ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న చలిసింగం గ్రామ మహిళలు

ప్రజాశక్తి -కొత్తకోట : నిధులు మంజూరైనా తాగునీటి సౌకర్యం కల్పనలో నిర్లక్ష్యం వల్ల తాము దాహార్తితో అల్లాడిపోతున్నామనిరావికమతం మండలం చీమలపాడు పంచాయతీ కొండశిఖర చలిసింగం గ్రామ ఆదివాసీ గిరిజన మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వేసవి తొలిరోజుల్లోనే గొంతెండి అల్లాడిపోతున్న తమకు, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఆదివాసీ మహిళల దీక్షలకు సిపిఎం సంఘీభావం ప్రకటించింది.

ఈ సందర్భంగా చలిసింగం గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళలుచీపురు వరలక్ష్మి, కిముడు సరస్వతి తదితరులు మాట్లాడుతూ తమ గ్రామంలో సుమారు వందకు పైగా కుటుంబాలలో 470 మందికి పైగా ఎస్‌టి భగత ఆదివాసీ గిరిజనులు జీవనం సాగిస్తున్నామన్నారు. పూర్వం నుంచి తాగునీటికి నేలబావిపైనే ఆధారపడుతున్న తమకు వేసవి వచ్చిందంటే గొంతెండిపోవాల్సిందేనని వాపోతున్నారు. కొండలపైనుంచి వచ్చేనీటిని గ్రామానికి సమీపంలోని నేలబావిలో నిల్వ ఉంచి తమ అవసరాలను తీర్చుకుంటున్నామన్నారు.ప్రస్తుతం వేసవిలో నేలబావుల్లోని నీరు అడుగంటి పోవడంతో తాగునీటికి అల్లాడిపోతున్నామని, దీనిప అనేకసార్లు అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా, హామీల మెట్టును దాటి నిధులుమంజూరు చేస్తున్నా నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం వల్ల తమకు నీటి కష్టాలు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు

గిరి మహిళల ఆందోళనకు సంఘీభావం తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవిందరావు మాట్లాడుతూ, చలిసింగం గ్రామానికి తాగునీరు కల్పించాలన్న సంకల్పంతో 2022లో సింగిల్ విలేజెస్ స్కీమ్ ద్వారా రూ 31లక్షల నాబార్డు నిధులు మంజూరు చేశారని, సికాయిపాడు వద్ద బోర్ ఏర్పాటు చేసి అక్కడ నుంచి సుమారు మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న చలిసింగం గ్రామానికి పైపులైన్ ద్వారా తాగునీటిని లిఫ్టింగ్ చేయాలని సంకల్పించారు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా పనులు సక్రమంగా సాగలేదని, దీంతో రూ. లక్షల నిధులు వృధా తప్ప, చలిసింగం గ్రామస్తులకు తాగునీరు అందలేదని గోవిందరావు ఆరోపించారు.

జల్‌జీవన్‌మిషన్‌లో నిధులు మంజూరైనా జరగని పనులు

తాజాగా జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా రూజ41 లక్షల నిధులు మంజూరు చేయగా, ఫిబ్రవరి తొలి వారంలో జిల్లా కలెక్టర్ స్వయంగా మూడు కిలోమీటర్లు కాలినడకన కొండపైకి చేరుకుని, గిరిజనం తాగునీటి కష్టాలకు స్పందించి, వెంటనే పనులు చేపట్టి పూర్తిచేయాలని ఆదేశించారు. అయితే పనుల్లో వీసమెత్తయినా కదలిక లేకపోవడం, కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు కావడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన నిధులతోతాగునీటి సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.